ప్రారంభానికి ముందే శిథిలావస్థ!

- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో యూపీహెచ్‌సీల దుస్థితి
- పట్టించుకోని అధికారులు, నాయకులు



మొగిలిపాడులో పిచ్చిమొక్కల మధ్య భవనం

కాశీబుగ్గ: ప్రారంభానికి ముందే విలువైన భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. దీనికి పాలకులు, అధికారుల వ్యవహార శైలే కారణమనే విమర్శలు ఉన్నాయి. పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన అర్బన్ ప్రాథమిక హెల్త్ కేంద్రాలు (యూపీహెచ్‌సీ) ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారుతున్నాయి. ప్రాంతాలను యూనిట్‌గా తీసుకుని అర్బన్ ప్రాథమిక హెల్త్ సెంటర్లను గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించింది. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మూడు చోట్ల యూపీహెచ్‌సీ భవనాలను నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో రెండు భవనాల నిర్మాణాలు పూర్తవ్వగా.. ఒక భవనం పనులు ప్రభుత్వం మారడంతో మధ్యలో నిలిచిపోయాయి. దీంతో విలువైన భవనాలు ఉన్నప్పటికీ యూపీహెచ్‌సీలను ప్రైవేటు భవనాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి నెలకుంది.

ప్రారంభంకాక.. సేవలకు దూరంగా..

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పూర్తి డిజిటలైజేషన్‌ను చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలవలే వైద్య సేవలు అందించడంతోపాటు ఈ కేంద్రాల్లో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారు. వైద్యులు, ఫార్మాసిస్టు, ల్యాబ్‌టెక్నీషియన్, నర్సులు, ఎఫ్‌ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలు సేవలు అందిస్తారు. వీరేకాకుండా టెలి మెడిషన్ పద్ధతులలో సంబంధిత స్పెషలిస్టులు రోగుల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు అందిస్తారు. చిన్నపిల్లల నుంచి పెద్దవారి కోసం ఉపయోగపడే వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచుతారు. అయితే పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్రస్తుతం ఈ సేవలు అందని పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు, ఆర్ అండ్ ఆర్ కాలనీ, సూదికొండ ప్రాంతాల్లో మూడు అర్బన్ హెల్త్‌సెంటర్‌లు మంజూరయ్యాయి. వీటిలో సూదికొండలో స్థల వివాదం కారణంగా పనుల్లో జాప్యం నెలకుంది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మిగిలిన రెండు పనులు పూర్తయ్యాయి. ఒక్కో భవనాన్ని 85 లక్షల రూపాయలతో గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే ఆ భవనాలు ప్రస్తుతం ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారాయి. భవనాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. భవనం కిటికీలు సైతం పగిలిపోతున్నాయి. అర్బన్ హెల్త్ భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడంతో ప్రజలు మెరుగైన వైద్య సేవలకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటిని ప్రారంభించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

సమీక్షించి ప్రారంభిస్తాం



మున్సిపాలిటీలో మొగిలిపాడు, ఆర్ అండ్ ఆర్ కాలనీలో అర్బన్ హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే వాటికి నగదు లావాదేవీల సమస్యలు ఉండటంతో సంబంధిత అధికారులు మాకు అప్పగించలేదు. సూదికొండలో నిర్మాణంలో ఉన్న భవనం పనులు నిలిచిపోయాయి. వీటిపై స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించిన అనంతరం ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నాయి. అంత వరకు ప్రైవేటు భవనాల్లో యూపీహెచ్‌సీలను నిర్వహిస్తాం.

– నడిపేన రామారావు, కమిషనర్, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

విద్యుత్ చార్జీల పెంపుపై 27న నిరసన

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్



టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పేద, సామాన్యులపై చార్జీల భారం పెరిగిందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 27వ తేదీన టెక్కలిలో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం విధించిన కరెంట్ చార్జీల బాదుడుపై వినియోగదారులకు అండగా చేపడుతున్న పోరుబాట కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కేంద్రంలో విద్యుత్ శాఖ కార్యాలయాల వద్దకు ర్యాలీ, నిరసన, వినతిపత్రాల సమర్పణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సంతబొమ్మాళి మండలాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ వినియోగదారులు హాజరు కావాలని తిలక్ కోరారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

టెక్కలి: ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడమే కాకుండా వారిపై అదనపు చార్జీలు, నిత్యవసర ధరల భారం వేస్తున్నారని సీపీఎం నాయకులు ఎస్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు మండిపడ్డారు. సోమవారం టెక్కలిలో విలేకర్లతో మాట్లాడారు. పేద, సామాన్యులు భరించలేని విధంగా విద్యుత్ చార్జీలను పెంచేశారని దుయ్యబట్టారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇవ్వడం లేదని, మురుగు కాలువల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, వీధుల్లో పూర్తి స్థాయిలో మంచినీటి కుళాయిలు లేక ఇబ్బందులు పడుతున్నారని, జగనన్న కాలనీలో స్థలాలు ఆక్రమణలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు హెచ్.ఈశ్వరరావు, యు.లక్ష్మణరావు, పోలయ్య, సుబ్రహ్మణ్య, దుర్గారావు, ధర్మారావు ఉన్నారు..

వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలి



వజ్రపుకొత్తూరు రూరల్: మాట్లాడుతున్న తహసీల్దార్ సీతారామయ్య

టెక్కలి: వినియోగదారుల హక్కులపై అవగాహన ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కళాశాలలో అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.రామారావు, కోటేశ్వరరావు, హేమరాజు, త్రినాథరావు, మల్లేశ్వరరావు, లోకేశ్వరరావు, తేజోవతి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వినియోగదారుల హక్కు చట్టాల పట్ల అవగాహన అవసరమని తహసీల్దార్ డి.వి.సీతారామయ్య అన్నారు. జిల్లా గ్రామీణ వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దువ్వాడ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నగరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు మోసపూరిత ప్రకటనల బారిన పడకుండా నాణ్యమైన వస్తు సేవలను పొందాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవరావు, సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు లీలారాణి, టి.భోజరాజు, సూర్యానారాయణ ఉన్నారు.

నీటిలోనే వరిచేను



బెంకిలిలో నీటిలో ఉన్న వరి చేను

సోంపేట: ఇటీవల కురిసిన వర్షాలతో చాలా గ్రామాల్లోని వరిచేలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. దీంతో తాము ధాన్యాన్ని నష్టపోతున్నామని.. ప్రభుత్వం ఆదుకోవాలని బెంకిలి, పలాసపురం, బారువ . గొల్లగండి. ఇస్కల పాలేం. రుషికుడ్డ గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు. అధికారులు పరిశీలించి తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల సంఘ నూతన కార్యవర్గం



ఎంపీడీవోకు కార్యవర్గం జాబితాను అందజేస్తున్న దృశ్యం

నందిగాం: నందిగాం మండల డిజిటల్ అసిస్టెంట్ల సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎన్నిక ప్రక్రియ జరిగింది. అధ్యక్షునిగా ఎ.సోమేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా కె.వాసుదేవరావు, సెక్రటరీగా కె.పుష్పలత, జాయింట్ సెక్రటరీగా ఎ.శివశంకర్, ట్రెజరర్‌గా కె.షణ్ముఖరావు, సలహాదారులుగా పి.మల్లేశ్వరరావు, సీహెచ్ ఉదయ్‌కిరణ్ నియమితులయ్యారు. కార్యవర్గం జాబితాను ఎంపీడీవో రాజారావుకు సభ్యులు అందజేశారు.

వరిపైరు పరిశీలన



కవిటిలో నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న ఏవో దుర్గాప్రసాద్

కవిటి: ఇటీవల కురిసిన వర్షాలకు నీటిలో తడిసిన వరిపనులు, ఓవుల్ని నీటినుంచి బయటకు తీసి దానిపై తగినంత ఉప్పుద్రావణం చల్లుకోవాలని మండలం వ్యవసాయ అధికారి బడగల దుర్గాప్రసాద్ అన్నారు. కవిటి, బెజ్జి పుట్టుగ గ్రామాల్లో తడిసిన వరిపైరు, పంట పొలాలను సోమవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి బెందాళం శ్రీ కళ్యాణ్, సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి, వ్యవసాయ సహాయకులు అమూల్య, వినోద్ ఉన్నారు.

క్లుప్తంగా

జగనన్న కాలనీకు మంచినీరు సరఫరా చేయండి



ఎంపీడీవోకు వినతి అందజేస్తున్న సర్పంచ్ సంజీవరావు, కాలనీవాసులు

టెక్కలి: కోటబొమ్మాళిలోని జగనన్న కాలనీకి మంచినీటి సరఫరా చేయాలని సర్పంచ్ కె.సంజీవరావుతో పాటు కాలనీవాసులు కోరారు. ఈ మేరకు కోటబొమ్మాళి ఎంపీడీఓ కె.ఫణీంద్ర కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్ మోటార్లు పాడవ్వడంతో వాటిని మరమ్మతులు చేసే విషయంలో పంచాయతీ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తమకు ఎటువంటి సంబంధం లేదని చెబుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తక్షణమే మోటార్లకు మరమ్మతులు చేసి మంచినీటి సరఫరా చేయాలని విన్నవించారు.

డ్రగ్స్‌పై అవగాహన



పోస్టర్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రబీన్ కుమార్‌పాఢీ

ఇచ్ఛాపురం: యువతకు డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రబీన్‌కుమార్ పాఢీ అన్నారు. డ్రగ్స్‌పై అవగాహన కల్పించేలా కళాశాల గోడలపై సోమవారం పోస్టర్లను ఏర్పాటు చేశారు. వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివారావు, అధ్యాపక సిబ్బంది నాగేశ్వరరావు, సంతోష్, త్రిపాఠి, రాధ, దేవరాజు ఉన్నారు.

ఎంఈవో–2గా విశ్వనాథం



విశ్వనాథాన్ని అభినందిస్తున్న ఎమ్మార్సీ సిబ్బంది

ఇచ్ఛాపురం రూరల్: మండల విద్యాశాఖాధి–2గా ధర్మపురం ఉన్నతపాఠశాల గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు ఎస్.విశ్వనాథం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కొంత కాలంగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఆ స్థానంలో విశ్వనాథాన్ని నియమిస్తున్నట్లు రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ ఈనెల 13న ఉత్తర్వులు జారీ చేశారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ఎమ్మార్సీ సిబ్బంది విశ్వనాథానికి పూలమాలలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన బి.తోటూరు ప్రాథమిక పాఠశాలలో వార్షిక తనిఖీ నిర్వహించారు.

పల్లెవెలుగు బస్సు ప్రారంభం



బస్సును ప్రారంభిస్తున్న విప్ అశోక్

కంచిలి: మండలంలోని జె.శాసనం గ్రామం నుంచి సోంపేటకు ఏర్పాటు చేసిన పల్లెవెలుగు బస్సును ప్రభుత్వ విప్ బి.అశోక్ సోమవారం ప్రారంభించారు. పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది

వజ్రపుకొత్తూరు: గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అయ్యాంగార్ జీవితాన్ని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు అన్నారు. గోవిందపురం ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షల్లో గెలుపొందిన ఐదుగురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం. కె.హరిబాబు, గణిత ఉపాధ్యాయులు చింత ఉమారావు, కర్ని రమణ ఉన్నారు.

ఘనంగా అణగాష్టమి పూజలు



షిర్డీసాయి మందిరంలో పూజలు చేస్తున్న మహిళలు

నందిగాం: లక్ష్మీస్వరూపమైన అణగాదేవి పూజలను సోమవారం మార్గశిర బహుళ అష్టమి సందర్భంగా మహిళలు ఘనంగా చేశారు. నందిగాంలోని షిర్డీసాయిబాబా మందిరంలో గ్రామ పురోహితులు మేడేపల్లి రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక పూజల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

కొత్తూరులో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



కొత్తూరులో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: వడ్డితాండ్ర పంచాయతీ కొత్తూరు గ్రామంలో బిలీవర్స్ ఈస్ట్రన్ చర్చి పాస్టర్ రమణ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా సోమవారం నిర్వహించారు. పాపులను రక్షించుటకు జీసస్ రాకకు సమయం ఆసన్నమైందని పాస్టర్ అన్నారు. కొత్తూరు, వడ్డితాండ్ర, కోటపాడు, గోపాలపురం గ్రామాల పురవీధుల్లో తిరిగి యేసు గొప్పతనాన్ని చెబుతూ ప్రార్ధనలు చేశారు.

విద్యుత్ అలంకరణలో చర్చిలు



విద్యుత్ వెలుగుల్లో చర్చి

కాశీబుగ్గ: క్రిస్మస్ పండుగ కోసం చర్చిలు ముస్తాబవుతున్నాయి. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ ఏడోవార్డు చినబడం గ్రామంలో ఉన్న క్రిస్టియన్ ప్రెయర్ టెంపుల్‌ను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

కాశీబుగ్గ: ఈ నెల 22వ తేదీ నుంచి తన కుమార్తె కనిపించడం లేదని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వవార్డు సూదికొండకు చెందిన గోళ్ల బాలాజీ ఫిర్యాదు చేసినట్టు పోలీసులు సోమవారం తెలిపారు. కేసు నమోదు చేస్తున్నామన్నారు.

ఆకట్టుకున్న గణితం పోస్టర్ ప్రదర్శన



టెక్కలి: సీతాపురం పాఠశాలలో గణిత పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

టెక్కలి: గణిత పితామహుడు శ్రీనివాసా రామానుజన్ జయంతిని పురస్కరించుకుని సీతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్.వేణికుమారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గణితం పోస్టర్ ప్రదర్శన ఆకట్టుకుంది. గణితానికి సంబంధించి అన్ని రకాల అంశాలతో విద్యార్థులు పోస్టర్ ప్రదర్శించారు.

ఇచ్ఛాపురం రూరల్: సమాజానికి స్ఫూర్తి ప్రదాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అని డొంకూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.సరోజిని అన్నారు. పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణితం ఉపాధ్యాయుడు ఎల్.గోవిందరావు మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై ఉన్న భయాన్ని విడనాడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన గణితం ఎగ్జిబిషన్, నృత్యాభినయనాలు అలరించారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న సంఘ సభ్యులు

కాశీబుగ్గ: వివేకానంద రామకృష్ణా సేవా సంఘం ఆధ్వర్యంలో కాశీబుగ్గలోని శారదానగర్ ప్రాంతానికి చెందిన 50 మంది విద్యార్థులకు సోమవారం నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అండగా..



సంతబొమ్మాళి మండలం బడేకుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాతపట్నంలోని నవజీవన్ బాలికల ఆశ్రమానికి చెందిన 68 మంది బాలికలకు దుప్పట్లు, 12 రకాల సామగ్రిని సోమవారం అందజేశారు. నర్సాపురం మాజీ సర్పంచ్ బడే దాలినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాసరెడ్డి సమకూర్చారు. కార్యక్రమంలో స్పందన పౌండేషన్ అధ్యక్షుడు షణ్ముఖరావు, సర్పంచ్ భూషణరెడ్డి, శివారెడ్డి, సిమ్మన్న, చందు, చిరంజీవి పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

విద్యార్థుల ప్రతిభ



శ్రీనివాస రామనుజన్ జయంతి సందర్భంగా సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో కంచిలి మండలంలోని డీజీపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటరు. పదో తరగతి విభాగంలో బవున్ ప్రధాన్ ప్రథమ, లక్ష్మీ దొలై ద్వితీయ, ఎనిమిదో తరగతి విభాగంగలో జీరు ఉమామాధురి ప్రథమస్థానం దక్కించుకున్నారు. నిర్వాహకులు ఉమామాధురికి ప్రత్యేక బహుమతిగా సైకిల్ అందజేశారు.ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ రమేష్, ఉపాధ్యాయులు నయన్‌కుమార్ పండా, కోన శ్రీహరి విద్యార్థినులు అభినందించారు.

–కంచిలి

ఎమ్మెల్సీ పరామర్శ



సోంపేట మండలం బారువ గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నేత భువనేశ్వర్ పాణిగ్రాహి తల్లి లలితాంబ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు భువనేశ్వర్ పాణిగ్రాహి కుటుంబాన్ని సోమవారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. పార్టీ నాయకులు ఇప్పిలి కృష్ణారావు, మాజీ ఎంపీపీలు మంగి ధనలక్ష్మి, మంగి గణపతి, కంచిలి ఎంపీపీ పైల దేవాదాస్ రెడ్డి కొనపల సురేష్ తదితరులు ఉన్నారు.

–సోంపేట

శ్రీనివాస రామానుజన్‌కు నివాళులు



గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 137 జయంతి వేడుకలను సోమవారం టెక్కలి మండలం చాకిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.అనురాధ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పి.చిన్నారావు, కె.మురళీకృష్ణ, బి.ఆనందరావు, ఆర్.జ్యోతి, వైకుంఠరావు, బి.నారాయణరావు, సుధారాణి ఉన్నారు.

–టెక్కలి రూరల్

ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలి



పలాస: ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు



వజ్రపుకొత్తూరు రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

పలాస: ఉద్దానం ప్రాంతంలో నిర్మించతలపెట్టిన కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఆర్డీవో బి.వెంకటేశ్‌కు సోమవారం రైతులు తరపున వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎయిర్ పోర్టు నిర్మాణం పేరుతో సుమారు 1400 ఎకరాల జీడి తోటలను ప్రభుత్వం సేకరించడానికి ప్రణాళికలు సిద్ధం చేసిందన్నారు. దీని వల్ల 20 గ్రామాలకు చెందిన రెండు వేల కుటుంబాలు తమ జీవనోపాధిని కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. విలువైన జీడి పంటతో పాటు అందులో అంతర్గత పంటలైన పనస, మామిడి, మునగ, అరటి తదితర ఉద్యాన వన పంటలు కూడా పోతాయన్నారు. ఆర్డీవోను కలిసిన వారిలో రైతు సంఘాల ప్రతినిధులు దున్న రామారావు, తెప్పల డిల్లీరావు, పొట్టి ధర్మారావు, కొమర వాసుదేవరావు, గుంటి లోకనాధం, మామిడి తులసయ్య ఉన్నారు.

ఎయిర్‌పోర్టు పేరుతో పొట్టకొట్టొద్దు

వజ్రపుకొత్తూరు రూరల్: కార్గో ఎయిర్ పోర్టు నిర్మాణం పేరుతో పచ్చని ఉద్దాన ప్రాంతాన్ని విధ్వంసం చేస్తూ తమ పొట్ట కొట్టవద్దని బాధిత గ్రామాల రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ డి.వి.సీతారామయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. తాము నమ్ముకున్న భూములను బలవంతంగా లాక్కొని అన్యాయం చేయవద్దని కోరారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

మహిళా పోలీసులతో సమీక్ష



సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ: కాశీబుగ్గ పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ సూర్యనారాయణ సోమవారం మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలాస మండలం పరిధిలోని 19 పంచాయతీల పరిధిలో ఉన్న 16 సచివాలయాలు, పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో 31 వార్డుల పరిధిలో ఉన్న 16 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న మహిళా పోలీసులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన సమస్యలు, అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు.

మొక్కలు నాటివేత



మొక్కను నాటుతున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఉదయపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో రైతు దినోత్సవం సందర్భంగా సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఉపాధ్యాయులు జుత్తు పురుషోత్తం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. అంబేడ్కర్‌నగర్ ప్రాంతంలో కూడా మొక్కలు నాటారు.

రైతులను ఆదుకోవాలి

ఇచ్ఛాపురం రూరల్: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. వర్షాలకు మండలంలోని 700 ఎకరాల్లో వరిపంట నాశనమైందన్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి పండించిన పంట నీటి పాలవ్వడంతో అన్నదాతలు కుదేలయ్యారని అన్నారు. రైతులకు అందించాల్సిన అన్నదాత సుఖీభవను ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం అందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అధికారులతో సర్వే చేయించి వెంటనే రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయాలని, తేమ శాతాన్ని పరిగణలోకి తీసుకోకూడదని అన్నారు.